గడప గడపకు సంక్షేమం

● ఎమ్మెల్యే శంబంగి


నందిగాంలో మహిళకు బుక్‌లెట్ అందజేస్తున్న బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి

తెర్లాం: రాష్ట్రంలోని పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి, సంక్షేమ పాలనకు కేరాఫ్ అడ్రస్‌గా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమం అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమని అన్నారు. మండలంలోని నందిగాం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల పథకాల ద్వారా నాలుగేళ్లలో ఆ కుటుంబానికి వర్తించిన లబ్ధిని వివరిస్తూ వాటికి సంబంధించిన బుక్‌లెట్‌ను అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఏ ముఖ్యమంత్రి అమలు చేయనన్ని సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అన్ని వర్గాల ప్రజలు అందిస్తున్నారని తెలిపారు. గడచిన నాలుగేళ్లలో 98.5శాతం హామీలను అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ చరిత్రలో నిలిచిపోతారన్నారు. 2024లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో సీఎం జగన్‌ను మళ్లీ ప్రజలంతా ఆశీర్వదించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బొబ్బిలి, తెర్లాం వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు శంబంగి వేణుగోపాలనాయుడు, నర్సుపల్లి బాబ్జీరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గర్భాపు ఊర్వ, మండల వైస్ ఎంపీపీ చేపేన సత్యనారాయణ, మండల పార్టీ సీనియర్ నాయకులు మర్రాపు జగన్నాథం, గుల్లిపల్లి మృత్యుంజయరావు, గ్రామ సర్పంచ్ ఆర్నిపల్లి గంగ, ఎంపీటీసీ సభ్యురాలు అల్లు గౌరి, ఈఓపీఆర్‌డీ రాంబాబు, డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అన్నివర్గాల అభివృద్ధే సీఎం లక్ష్యం

● ఎమ్మెల్యే కంబాల జోగులు


లచ్చయ్యపేటలో లబ్ధిదారులకు బుక్‌లెట్లు అందిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం : అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. పట్టణంలోని లచ్చయ్యపేట -1 సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, తదితరులతో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ఒక్కో ఇంటికి ఎంత సంక్షేమం కలిగినదీ వివరిస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అలాగే ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీలన్నీ మేనిఫెస్టోలో పొందుపరిచి శతశాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. సంక్షేమ పథకాలన్నీ కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కంబాల సందీప్, పాలవలస శ్రీనివాసరావు, వంజరాపు విజయ్‌కుమార్, జినగం ఈశ్వరరావు, నల్లా శ్రీనివాసరావు, కోల్ల రమ్య, గుంటముక్కల సప్తగిరి, చల్లా జయరాం, పిచ్చుక శ్రీనివాసరావు, మున్సిపల్ మేనేజర్ ఎంవీ నాగరాజు, ఏతఅ రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

మహానాడు తీర్మానాలు ఎప్పుడైనా అమలు చేశారా..!

● ఎమ్మెల్యే శంబంగి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

బొబ్బిలి: మహానాడు కోసం గొప్పలకు పోతున్న చంద్రబాబునాయుడు ఏనాడైనా చేసిన తీర్మానాలను అమలు చేశారా.. అని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ప్రశ్నించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర బడ్జెట్‌ను పేద, మధ్య తరగతి ప్రజల కోసం ఖర్చు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసి చంద్రబాబు అండ్‌కోకు పిచ్చిపట్టి అరుస్తున్నారన్నారు. యువగళం పేరుతో వచ్చీరాని మాటలు మాట్లాడుతున్న పప్పు లోకేష్‌కు వాటి అర్థం తెలుసా.. అని ప్రశ్నించారు. రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి ప్రజలకు అర్హత ఉంటే చాలు పార్టీలు, కులమతాలు లేకుండా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని చూసి ఓర్వలేక చంద్రబాబుకు పిచ్చిపట్టి ఏవేవో మాట్లాడుతున్నారన్నారు. పిచ్చాస్పత్రిలో చేరాల్సిన వాడు ప్రజల మధ్యకు వచ్చి వాగుతుంటే ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని ఎద్దేవా చేశారు. సుపరిపాలనపై విపక్షాలతో ఏవేవో కల్లబొల్లి కబుర్లు చెబితే ప్రజలు నమ్మేస్తారన్న భ్రమలో చంద్రబాబు ఇంకా ఉన్నారన్నారు. బాబుకు తోడు దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్ కూడా మితిమీరిన ఆత్మవిశ్వాసంతో పనిగట్టుకుని టీడీపీకి మద్దతుగా ప్రచారం చేస్తున్నారన్నారు. టీడీపీ హయాంలో ప్రతిపక్షాలు చేసిన ధర్నాలు ఇప్పుడు కనిపించడం లేదన్నారు. దీనికి కారణం జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనేనని శంబంగి చెప్పారు. జాతికి అంకితం చేసిన సుగర్ ఫ్యాక్టరీలను విక్రయించిన చంద్రబాబునాయుడు చెరకు రైతుల గూర్చి మాట్లాడటం మొసలి కన్నీరు కాక మరేమిటని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, మున్సిపల్ కౌన్సిలర్ మరిపి తిరుపతిరావు, మాజీ కౌన్సిలర్ రుంకాన ప్రసాదరావు ఉన్నారు.

పరిశీలన


రికార్డులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: పట్టణంలోని మల్లికార్జున కాలనీ గల అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే కంబాల జోగులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా చిన్నారుల వివరాలపై ఆరా తీయడంతో పాటు రికార్డులు పరిశీలించారు. జగనన్న కిట్లు, వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం అమలుపై కార్యకర్తలు శ్రీదేవి, విజయకుమారి, రమాదేవిలను అడిగి తెలుసుకున్నారు. వారి పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ కంబాల సందీప్‌కుమార్, వంజరాపు విజయ్‌కుమార్, చల్లా జయరాం, బొమ్మన మున్నా, చింతపల్లి కృష్ణ, కుప్పిలి గణేష్, ఆసవు సూర్యం, తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

చింతాడలో పర్యటించిన ఎమ్మెల్యే శంబంగి


చింతాడలో పర్యటించిన ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: మండలంలోని చింతాడలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు శుక్రవారం పర్యటించారు. గ్రామంలో బీసీ వసతి గృహానికి వెళ్లే రోడ్డులో సిమెంటు రోడ్డు, కాలువలను నిర్మించాలని గ్రామస్తులు కోరారు. అలాగే చిన రామమందిరం వీధిలో నిర్మించిన కాలువపై సిమెంటు పలకలు ఏర్పాటు చేయాలని కోరారు. వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల ఇన్‌చార్జి తమ్మిరెడ్డి దామోదర రావు, సర్పంచ్ బంకురు తిరుపతిరావు, ఎంపీటీసీ తవిటినాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గౌరవవేతనం పెంచాలి


ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద సమస్యలు చెబుతున్న స్వచ్ఛదూత్ ఆయాలు

రేగిడి: వేసవి సెలవుల్లో కూడా విధులు నిర్వహిస్తున్న తమకు గౌరవ వేతనం పెంచాలని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వచ్ఛదూత్ ఆయాలు కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద ఎంఈఓ ఎంవీ ప్రసాదరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ కార్యదర్శి సీహెచ్ రామ్మూర్తినాయుడు, యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు చిన్నమ్మడు, స్వప్న, లత, రాములమ్మ, చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

చెరువును ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు


రాజయ్య కోనేరులో బోర్డు పాతిన రెవెన్యూ అధికారులు

సాక్షి ఎఫెక్ట్

బొబ్బిలి: మండలంలోని పిరిడిలో రాజయ్య కోనేరును ఆక్రమించుకుంటున్నట్టు సాక్షి దినపత్రికలో గురువారం ప్రచురితమైన వార్తకు రెవెన్యూ అధికారులు స్పందించారు. శుక్రవారం తహసీల్దార్ ఎస్.రాజారావు ఆదేశాలతో ఆర్‌ఐ కళ్యాణ చక్రవర్తి సిబ్బందిని వెంటబెట్టుకుని గ్రామానికి వెళ్లారు. అక్కడి చెరువును అందులో వేసిన రహదారులను పరిశీలించారు. ఇది జిరాయితీ చెరువు కాదని, ప్రభుత్వానికి చెందినదని ధృవీకరించారు. వెంటనే అక్కడ చెరువును ఆక్రమించిన వారు శిక్షార్హులు అంటూ బోర్డు పాతారు.

పారదర్శకంగా వలంటీర్ అభ్యర్థులకు ఇంటర్వ్యూ

బొబ్బిలి: మండలంలోని గోపాలరాయుడుపేట, కాశిందొరవలస, పెంట, ఎం పణుకువలస, పారాది గ్రామాల్లోని వలంటీర్ల పోస్టులకు శుక్రవారం అధికారులు ఇంటర్వ్యూలను నిర్వహించారు. తహసీల్దార్ ఎస్.రాజారావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ భాస్కరరావు, ఎంఈఓ చల్ల లక్ష్మణరావు తదితరులు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు.

వలంటీర్ల అభ్యర్థులకు ఇంటర్వ్యూ

రామభద్రపురం: మండలంలోని ఆరికతోట, రొంపల్లి పంచాయతీ పరిధిలో ఖాళీ ఏర్పడిన రెండు వలంటీర్ పోస్టులకు శుక్రవారం నిర్వహించిన ఇంటర్వ్యూ ప్రశాంతంగా ముగిసింది. ఎంపీడీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్ రామలింగేశ్వరరావు, ఈఓపీఆర్‌డీ వెంకటరమణ, ఎంఈఓ తిరుమలప్రసాద్ అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహించారు. రెండు పోస్టులకు గాను ఒక్కొక్క పంచాయతీలో ఇద్దరేసి చొప్పున్న అభ్యర్థులు హాజరయ్యారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధి ఆదర్శనగర్ కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణం శుక్రవారం కనులపండువగా నిర్వహించారు. పురోహితుడు వరప్రసాదరావు శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ కల్యాణం జరిపించారు. ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఉదయం నుంచే ప్రత్యేక పూజలు చేపట్టారు. మధ్యాహ్నం సుమారు 5 వేల మందికి అన్నసమారాధన చేశారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. కార్యక్రమంలో మడ్డువలస ప్రాజెక్ట్ ఈఈ రెడ్డి రామచంద్రరావు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్, కాలనీ పెద్దలు ఆర్నెపల్లి వెంకటనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

రాజాం సిటీ: ఉపాధి వేతనదారులు సమయపాలన పాటించాలని ఎంపీడీఓ బాసూరి శంకరరావు, ఏపీఓ కె. సాయిరాం అన్నారు. మండల పరిధి బొమ్మినాయుడువలసలోని ఎలకలబంద, తోటపల్లి కాలువలో చేపడుతున్న ఉపాధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. పరిశీలనలో ఆయనతో పాటు జేఈ నరేంద్ర, టీఏలు, ఎఫ్ఏలు ఉన్నారు.

సంక్షిప్తంగా...

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

బొబ్బిలి: ఆరోగ్యశ్రీపై ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా దుష్ప్రచారం చేస్తున్నాయని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. పాత బొబ్బిలిలో ఓ విలేకరి కుమారుడు ఆడుకుంటూ మేడపై నుంచి పడిపోయి తీవ్ర గాయాల పాలవడంతో శుక్రవారం పరామర్శించడానికి వెళ్లిన ఆయన మీడియాతో మాట్లాడారు. అలాగే క్షతగాత్రుడి కుటుంబ సభ్యులు ఆరోగ్యశ్రీతో అధునాతనమైన చికిత్స అందిందని, ఇటీవల టీవీల్లో ఆరోగ్యశ్రీకి డబ్బులివ్వలేదని, పథకం ఆగిపోయిందని చూసిన వార్త కల్పితం, దుష్ప్రచారమని అర్థమైందని ఎమ్మెల్యేకు చెప్పారు. ఆరోగ్యశ్రీలో తమ కుమారుడికి ఉచితంగా అధునాతనమైన శస్త్రచికిత్స చేశారని, వైఎస్సార్ ప్రభుత్వానికి రుణపడి ఉంటామని వారు చెప్పుకొచ్చారు. ఆయన వెంట జేసీఎస్ మండల ఇన్‌చార్జి తమ్మిరెడ్డి దామోదరరావు, బంకురు బాబూరావు తదితరులున్నారు.

సహకారమే లక్ష్యం

రాజాం సిటీ: సామాన్యులతో పాటు చిన్న వ్యాపారస్తులకు సహకారం అందించి వారి ఉన్నతికి తోడ్పాటునందించడమే విశాఖ కో ఆపరేటివ్ బ్యాంక్ లక్ష్యమని డైరెక్టర్ చెరువు ఆదినారాయణ అన్నారు. పట్టణంలోని ఓ కల్యాణ మంటపంలో రాజాం బ్రాంచ్ సభ్యుల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్య, వైద్య సంస్థల అభివృద్ధితో పాటు పలు రకాల వృత్తిదారులకు అనేక రుణాలు మంజూరు చేస్తూ వారి అభివృద్ధికి బ్యాంక్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. స్థానిక బ్రాంచ్ డైరెక్టర్ ఎ. రామకృష్ణ మాట్లాడుతూ, ఖాతాదారులకు సేవలందించడంలో సిబ్బంది, పాలకవర్గం కలసికట్టుగా పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ డైరెక్టర్లు కందాపు ప్రసాదరావు, ఉప్పలపాటి పార్వతీదేవి, జోనల్ ఏనేజర్ జి.రమణమూర్తి, మేనేజర్ జీఎల్‌వీ ప్రకాషరావు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ, జలవనరుల శాఖ ఉమ్మడి సర్వే

బొబ్బిలి: మండలంలోని జగన్నాధపురం గ్రామానికి చెందిన రైతులు భైరిసాగరం సాగునీటి కాలువ ద్వారా తమ పొలాలకు రావాల్సిన సాగునీరు సక్రమంగా పారనీయకుండా కొందరు రియల్టర్లు కాలువను ఆక్రమించారని ఆర్డీఓకు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ, జలవనరుల శాఖ సిబ్బంది ఉమ్మడి సర్వే చేపట్టారు. శుక్రవారం సాయంత్రం చేపట్టిన ఈ సర్వే నివేదికను తహసీల్దార్, ఆర్డీఓకు అందజేస్తామని విలేకర్లకు తెలిపారు. పాత బొబ్బిలిలోని అతి పెద్ద భైరి సాగరం చెరువు నుంచి జగన్నాధపురం తదితర గ్రామాలకు సాగునీరు వెళ్తోంది. గత కొన్నాళ్లుగా ఈ కాలువ ద్వారా సాగునీటిని సక్రమంగా పారనీయకుండా కొందరు బడా రియల్టర్లు కాలువను ఆక్రమించారని ఫిర్యాదు వెళ్లడంతో ఈ సర్వే చేపట్టారు.

ఆక్రమణల తొలగింపు

రేగిడి: కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాల మేరకు మండలంలోని ఆమదాలవలస గ్రామ సమీపంలో కొండగోర్జి ఆక్రమణలను శుక్రవారం తొలగించారు. తహసీల్దార్ టి. కల్యాణచక్రవర్తి ఆధ్వర్యంలో జేసీబీతో ఆక్రమణలు తొలగించడంపై గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం హద్దులు గుర్తించి గోర్జిని బాగుచేస్తామని తహసీల్దార్ తెలిపారు.

జాబ్‌కార్డు ఉన్నవారికే ఉపాధి

రేగిడి: జాబ్‌కార్డు ఉన్నవారికి మాత్రమే ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాథరావు సూచించారు. మండలంలోని వండానపేట, ఉప్పర్నాయుడువలస, చాటాయివలస గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొలతల ప్రకారం పనులు చేస్తే వేతనం గిట్టుబాటు అవుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీఓ హరనాథరావు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఐరిస్ యంత్రాల పంపిణీ

రాజాం: రేషన్ పంపిణీకి సంబంధించిన ఐరిస్ యంత్రాలను శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద పంపిణీ చేశారు. రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల్లో రేషన్ పంపిణీ చేసే మొబైల్ వ్యాన్ డిస్ట్రిబ్యూటర్లకు వీటిని తహసీల్దార్ ఎ.విజయభాస్కర్ అందజేశారు. మొత్తం 55 మందికి వీటిని అందించామని, వేలిముద్రలు పడకుంటే వీటి ద్వారా లబ్ధిదారులకు రేషన్ అందిస్తామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ చిరంజీవిరావు, రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల డీటీలు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

విత్తనాల పంపిణీకి చర్యలు

రాజాం సిటీ: ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి మండలంలోని అన్ని గ్రామాల రైతులకు విత్తనాలు కొరత లేకుండా పంపిణీకి చర్యలు చేపడుతున్నామని ఏఓ ఎం.రేణుకాసాయి అన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఆర్బీకేలలో ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మండల పరిధిలోని డీఆర్ఎన్‌వలసలో వరి, పచ్చిరొట్ట విత్తనాల కోసం చేపడుతున్న రిజిస్ట్రేషన్‌ను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కరణం తులసినాయుడు, వీఏఏ అపర్ణ, రైతులు పాల్గొన్నారు.

'సూక్తి రత్నమంజరి' పుస్తకావిష్కరణ రేపు

రాజాం సిటీ: పట్టణంలోని విద్యానికేతన్ పాఠశాలలో ఆదివారం రాజాం రచయితల వేదిక 'శతసాహితీ సమావేశ సంబరం' నిర్వహించనున్నట్లు వేదిక నిర్వాహకుడు పిల్లా తిరుపతిరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వేదిక అధ్యక్షుడు గార రంగనాథం రచించిన 'సూక్తి రత్నమంజరి' గ్రంథాన్ని సాహితీ ప్రవంతి రాష్ట్రశాఖ కార్యదర్శి చీకటి దివాకర్ ఆవిష్కరించనున్నారని పేర్కొన్నారు. ఉదయం 9.30 గంటలకు జరగనున్న ఈ కార్యక్రమంలో కవులు, రచయితలు, తెలుగుభాషాభిమానులు, సాహిత్యాభిమానులు పాల్గొనాలని కోరారు.

పారిశుద్ధ్య కార్మికుడు సస్పెన్షన్‌కు ఆదేశం

బొబ్బిలి: పట్టణంలోని బలిజిపేట రోడ్డు వెనుక వీధిలో సేకరించిన చెత్తను రోడ్లపై పారేస్తున్న ఓ పారిశుద్ధ్య కార్మికుడిని సస్పెండ్ చేయాలని కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. క్షేత్ర పర్యటనకు వెళ్లిన ఆయన గ్రహించిన పై విషయంపై నిర్లక్ష్యంగా ఉన్న వార్డు శానిటేషన్ సెక్రటరీకి చార్జిమెమో ఇవ్వాలని ఆదేశించారు. రాజానగర్ కాలనీ, రత్నాల నగర్, మార్కెట్ యార్డు, బందారు వీధి ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. బందారు వీధి రోడ్డు విస్తరణ పనుల వలన కొత్తగా వేసిన పైప్‌లకు డమ్మీలు వేసుకోవాలని ప్రజలకు సూచించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ పబ్లిక్ హెల్త్ మేస్త్రీలు, ఎన్విరాన్ మెంట్ సెక్రటరీలతో కమిషనర్ పర్యటించి పారిశుద్ధ్యం సక్రమంగా ఉండాలని పలు సూచనలు చేశారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

తెర్లాం: మండలంలోని ఆమిటి గ్రామంలో చేపట్టిన పారిశుద్ధ్య పనులను ఈఓపీఆర్‌డీ ఆర్.రాంబాబు శుక్రవారం పరిశీలించారు. గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి చింతల సత్యనారాయణ గ్రామంలోని చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రం వద్ద పేరుకుపోయిన చెత్తను జేసీబీ సహాయంతో ట్రాక్టర్లలో వేసి డంపింగ్‌యార్డుకు తరలించారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న జంగిల్‌ను తొలగించడంతో పాటు, సీసీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న మురికి కాలువను జేసీబీతో శుభ్రం చేయించారు.

అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం

● ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర


మాట్లాడుతున్న రాజన్నదొర

మెంటాడ: సాలూరు నియోజకవర్గంలో గడిచిన నాలుగేళ్లలో రూ.800 కోట్లతో అభివృద్ధి, మరో రూ.800కోట్లతో సంక్షేమం ప్రజలకు అందిస్తే టీడీపీ నాయకులకు కనబడకపోవడం శోచనీయంగా ఉందని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని పోరాం గ్రామంలో విలేకరులతో శుక్రవారం మాట్లాడారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమంపై తాను బహిరంగ చర్చకు సిద్ధమని టీడీపీ నేతలకు సవాల్ విసిరారు. ఏ ప్రాంతానికి రమ్మన్న తాను వస్తానని చెప్పారు. సాలూరు నియోజకవర్గంలో టీడీపీ నిర్వహించిన మహానాడులో సంధ్యారాణి తనపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. రాజన్నదొరను తప్పుపడితే ఊరుకునేది లేదన్నారు. ఇంతవరకూ సంధ్యారాణి ఒక గిరిజన ఆడబిడ్డగా చూసి ఏరోజు ఒక్క మాట కూడా తాను వ్యక్తిగతంగా దూషణ చేయలేదన్నారు. తనను, తన ప్రభుత్వాన్ని దూషణ చేస్తే ఇకపై సంధ్యారాణిపై కూడా విరుచుకుపడటం ఖాయమన్నారు. ఆరేళ్ల ఎమ్మెల్సీలుగా ఉన్న ద్వారపురెడ్డి జగదీష్, గుమ్మడి సంధ్యారాణి ఒక్క గిరిజన గ్రామంలోనైనా రోడ్డు వేయించారా... అని ప్రశ్నించారు. అదే నాలుగేళ్లలో తమ ప్రభుత్వ హయాంలో అన్ని గిరిజన గ్రామాల్లో రోడ్లు తాగునీరు, మౌలిక వసతులు కల్పించామన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అసలైన వారసుడు జూనియర్ ఎన్టీఆర్ అని అన్నారు. చంద్రబాబుకు రానున్న ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో ఆయనతో పాటు జెడ్పీటీసీ లెంక సన్యాసప్పలనాయుడు, ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీ సారిక ఈశ్వరరావు, నాయుడుబాబు, బాయి అప్పారావు ఉన్నారు.

నిస్వార్థ సేవకులకు వందనం..

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందజేస్తున్న ఘనత వలంటీర్లకే దక్కుతుంది. కేవలం గౌరవ వేతనంపై ఆధారపడి ప్రభుత్వ ఆశయాలను తమ భుజాల మీద వేసుకుని మరీ నెరవేరుస్తున్నారు మన వలంటీర్లు. అటువంటి వారిని గౌరవించుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వారికి సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర పేర్లతో అవార్డులు, నగదు ప్రోత్సాహకాలు అందిస్తోంది. ఇందులో భాగంగా బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో వలంటీర్లను స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు శుక్రవారం సత్కరించారు.

– బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్


బొబ్బిలి: 5, 6 వార్డుల సచివాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం


బాడంగి: వాడాడలో వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీపీ, జేసీఎస్ కన్వీనర్, సర్పంచ్, ఈఓపీఆర్‌డీ


రామభద్రపురం: పాతరేగ సచివాలయంలో వలంటీర్లను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, కార్యదర్శులు


రాజాం సిటీ: మాదిగవీధి సచివాలయంలో సత్కారం పొందిన వలంటీర్లతో అధికారులు, నాయకులు


వంగర: కొప్పరలో సన్మానం అందుకున్న వలంటీర్లతో ఎంపీపీ సురేష్‌ముఖర్జీ, తదితరులు


రాజాం : గార్రాజు చీపురుపల్లిలో వలంటీర్లకు సత్కారం


రేగిడి : ఆమదాలవలసలో వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీడీఓ జి. కాశీవిశ్వనాథరావు, తదితరులు


సంతకవిటి: తమరాంలో వలంటీర్‌ను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

క్రీడలతో మానసిక ఉల్లాసం


వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎస్‌ఐ రమేష్

తెర్లాం : క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహదపడతాయని, గ్రామీణ ప్రాంతాల్లోని యువత క్రీడలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్‌ఐ ఆర్.రమేష్ అన్నారు. మండలంలోని తమ్మయ్యవలస గ్రామంలో సీఆర్‌పీఎఫ్ జవాన్ దివంగత బొత్స కిశోర్ జ్ఞాపకార్థం ఉత్తరాంధ్ర స్థాయి వాలీబాల్ టోర్నమెంటును స్థానిక యువత నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌ను శుక్రవారం ఎస్ఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కువగా యువత వాలీబాల్ ఆటపై మక్కువ చూపిస్తారని, అటువంటి ఆటలో ఉత్తరాంధ్ర స్థాయి టోర్నమెంట్‌ను తమ్మయ్యవలసలో నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని, ప్రతీ ఒక్కరూ ఏదో ఒక క్రీడలో రాణించాలని ఆయన కోరారు. ఉత్తరాంధ్ర స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో 60జట్లు పాల్గొంటున్నాయని, ఉదయం, సాయంత్రం, రాత్రి సమయాల్లో పోటీలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ చేపేన సత్యనారాయణ, రంగప్పవలస సర్పంచ్ శనపతి రాంబాబు, మాజీ సర్పంచ్ శనపతి కృష్ణారావు, దివంగత సీఆర్‌పీఎఫ్ జవాన్ కిశోర్ కుటుంబ సభ్యులు, స్థానిక యువత పాల్గొన్నారు.

ఇనాం భూములపై దర్యాప్తు


రైతులతో మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి. వెంకటేశ్వరరావు

సంతకవిటి: మండలంలోని గోళ్లవలసలో ఇనాం భూములపై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి. వెంకటేశ్వరరావు శుక్రవారం విచారణ చేపట్టారు. గ్రామానికి చేరుకున్న ఆయన రైతులతో సమావేశమై భూములకు సంబంధించిన విషయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామంలో మొత్తం 258 ఎకరాలు ఇనాం భూములుగా ఉన్నాయని, ఇందులో 58 ఎకరాలు చెరువులు, ప్రభుత్వ భూమిగాను మిగిలిన 200 ఎకరాలు రైతుల దగ్గర ఉన్నట్లు తెలిపారు. 1956 ఇనాం భూముల చట్టం ప్రకారం రైతుకు మూడు వంతులలో రెండు వంతులు, ఇనాందారునకు ఒక వంతు చెందుతుందని తెలిపారు. అయితే ఇప్పటి వరకు ఇనాందారుడు ఎవ్వరూ రాకపోవడంతో ఆ భూమి రైతులే అనుభవిస్తున్నట్లు ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు. సర్పంచ్ దాసరి దాలినాయుడు, ఎంపీటీసీ సభ్యుడు టంకాల కాశీ మాట్లాడుతూ, ఇప్పటివరకూ ఇనాందారుడు ఎవరూ రాకపోవడంతో మొత్తం భూమిపై రైతులకు సర్వహక్కులు వచ్చేలా చర్యలు తీసుకోవా లని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎ.సులోచనారాణి, మండల సర్వేయర్ సత్యనారాయణ, వీఆర్‌ఓలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.